సతతం.. హరితం

కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

జిల్లావ్యాప్తంగా శనివారం కోటి మొక్కలు నాటే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృక్ష సంపదను పెంచి పర్యావరణాన్ని కాపాడుదామని పిలుపునిచ్చారు.



ఎల్లమ్మ చెరువు వద్ద మొక్క నాటుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



గజ్వేల్‌రూరల్: శ్రీగిరిపల్లిలో మొక్క నాటుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు



దుబ్బాక రూరల్: మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చేర్యాల(సిద్దిపేట): మొక్కలు నాటే కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు



కోహెడ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ కీర్తి తదితరులు



జగదేవ్‌పూర్(గజ్వేల్): పీర్లపల్లిలో మొక్కలు నాటుతున్న నాయకులు

ఆకుపచ్చ తెలంగాణ ఆవిష్కరణ

హుస్నాబాద్: ఆకుపచ్చ తెలంగాణను ఆవిష్కరించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారం ప్రపంచంలోనే అతి పెద్ద మూడో మానవ ప్రయత్నమని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా శనివారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి మండలానికి ఐదు వేల మొక్కలు నాటేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని.. ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నెలకొల్పిన స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభించారు.

పొన్నం ఎంపీగా ఉండి ఏం చేశారు

హుస్నాబాద్ అభివృద్ధి చెందలేదని మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్ తాను ఎంపీగా ఉన్న సమయంలో హుస్నాబాద్ అభివృద్ధికి ఏం చేశారని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ రాజశేఖర్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

- మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో శనివారం గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచ్ చెరుకు చంద్రమోహన్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు.
- కోహెడ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అవరణలో ఎంపీపీ కీర్తి మొక్కలు నాటారు. అలాగే మండలంలోని కూరెళ్ల గ్రామం వడ్డెర కాలనీలో సర్పంచ్ గాజుల రమేష్ మొక్కలు నాటారు.
- హరిత తెలంగాణ లక్ష్యమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఏఎంసీ చైర్మన్ మదాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం జగదేవ్‌పూర్ మండలంలోని పీర్లపల్లి, ఇటిక్యాల, ధర్మారం, తిగుల్, చాట్లపల్లి, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో హరితహారం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేషంగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- **అక్కన్నపేట(హుస్నాబాద్):** అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి, గండిపల్లి, రామవరం గ్రామాల్లో శనివారం జెడ్పీటీసీ భూక్య మంగ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.
- **హుస్నాబాద్ రూరల్:** మండలంలోని జిల్లెలగడ్డ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఎంపీపీ మానస మొక్కలు నాటారు. సర్పంచ్ స్వరూప, తదితరులు పాల్గొన్నారు.
- **మిరుదొడ్డి(దుబ్బాక):** లక్ష్మీనగర్ శివారులోని సధానందాశ్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు మొక్కలను నాటారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీలింగం, ఎంపీడీఓ రాజిరెడ్డి, సర్పంచ్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.
- **తొగుట(దుబ్బాక):** వృక్ష సంపదను పెంచాలని పీఏసీఎస్ చైర్మన్ కన్నయ్య గారి హరికృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని మల్లన్నసాగర్ సమీపంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.
- **రాయపోలు(దుబ్బాక):** దౌల్తాబాద్ మండల కేంద్రంలో జెడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్‌గౌడ్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.
- దుబ్బాక మండలంలోని చౌదర్‌పల్లిలో డీపీఓ దేవకి, ఎంపీపీ పుష్పలత, జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి, సీఐ కృష్ణ, ఏఎంసీ చైర్మన్ జ్యోతి, సర్పంచ్ కుమార్, తదితరులు మొక్కలు నాటారు.
- **ములుగు(గజ్వేల్):** మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ జహంగీర్, పీఏసీఎస్ చైర్మన్ బట్టు అంజిరెడ్డి మొక్కలు నాటారు.
- **కొండపాక(గజ్వేల్):** తిప్పారం శివారులోని మల్లన్నసాగర్ ఆనకట్ట వద్ద డీఆర్‌డీఏ ఏపీడీ కౌసల్యాదేవి, ఎంపీపీ సుగుణ, తదితరులు మొక్కలు నాటారు.
- చేర్యాల పట్టణకేంద్రంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపారాణి, కౌన్సిలర్లు, కమిషనర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.
- **మద్దూరు(హుస్నాబాద్):** సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మద్దూరు పోలీస్‌స్టేషన్, నర్సాయపల్లిలో అధికారులు, ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు.
- **వర్గల్(గజ్వేల్):** వర్గల్ జ్యోతిబా పూలే మహిళా గురుకుల కళాశాల, వర్గల్ హైస్కూల్ వద్ద ఎంపీపీ లతా రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎంపీడీఓ మేరీస్వర్ణకుమారి, హెచ్‌ఎం వెంకటేశంగౌడ్ మొక్కలు నాటారు.

క్లుప్తంగా

హుస్నాబాద్‌లో బీజేపీదే గెలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శశాంక్ త్రివేది

అక్కన్నపేట(హుస్నాబాద్): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మొహాలీ ఎమ్మెల్యే శశాంక్ త్రివేది అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు గొల్లపెల్లి వీరాచారి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ప్రజల్లో బీఆర్ఎస్‌పై న మ్మకం పోయిందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా ఉపాధ్యక్షుడు విజయపాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ జనగామ వేణుగోపాల్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'పొన్నం వ్యాఖ్యలు సరికాదు'

హుస్నాబాద్: ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు లేదని గిరిజన సంఘాల నాయకులు అన్నారు. పట్టణంలో శనివారం వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దాదాపు 40 వేలకు పైగా గిరిజనులు జీవిస్తున్నారని తెలిపారు. 60 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని గిరిజన తండాలు నేడు అభివృద్ధి చెందాయన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని పొన్నం ప్రభాకర్ ఇక్కడ పోటీ చేసి గెలుస్తామనడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు తిరుపతి నాయక్, వివిధ సంఘాల నాయకులు రాజు నాయక్, సత్యం నాయక్, మోతిలాల్ నాయక్, వీరన్న నాయక్, తదితరులు ఉన్నారు.

చెక్ డ్యాం మరమ్మతులు చేపట్టాలి

హుస్నాబాద్: ఇటీవల కురిసిన వర్షాలకు పందిల్ల చెక్‌డ్యాం కోతకు గురైందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతూ శనివారం ఇరిగేషన్ అధికారులకు రైతులు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో కట్ట పూర్తిగా తెగిపోయిందన్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కట్ట మరమ్మతులకు నిధులు మంజూరు చేయించి చెక్‌డ్యాం పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

క్రీడలను విజయవంతం చేయండి

హుస్నాబాద్: పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలతో శనివారం మండల విద్యాధికారి దేశిరెడ్డి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలస్థాయిలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు వచ్చే నెల 1, 2వ తేదీల్లో పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్‌కు మాతృ వియోగం



చిట్టి దేవేందర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి తల్లి లక్ష్మి (80) శనివారం అనారోగ్యంతో కొండపాకలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహాదేవ్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిబాబ, తదితరులు మృతదేహానికి నివాళులర్పించారు.

కనీస వేతనాలు చెల్లించండి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆశవర్కర్లకు ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చొప్పరి రవి డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలంలోని ఆశకార్యకర్తలు సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం దౌల్తాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి బాలమణి, సభ్యులు పాల్గొన్నారు.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



మాట్లాడుతున్న పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): ఆలస్యం చేయకుండా చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని జేఏసీ చైర్మన్ రామగల్ల పరమేశ్వర్ డిమాండ్ చేశారు. శనివారం వాసవి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సీఎం కేసీఆర్ మెదక్ పర్యటన సందర్భంగా కొత్తగా రామాయంపేట్, పటాన్‌చెరు ప్రాంతాలను డివిజన్లుగా ప్రకటించిన విషయాన్ని గుర్తు చేస్తూ చేర్యాలను ఎందుకు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సెప్టెంబర్ 2న చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో అఖిలపక్ష, జేఏసీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి



చిన్నకోడూరులో ఓటరు నమోదును పరిశీలిస్తున్న ఆర్డీఓ రమేష్‌బాబు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సిద్దిపేట ఆర్డీఓ రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని చిన్నకోడూరు, పెద్దకోడూరు గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలు కృషి చేయాలన్నారు. జాబితాలో ఉన్న వారిలో ఏమైనా పొరపాట్లు ఉంటే సవరణలు చేసుకునేందుకు శ్రద్ధ చూపాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జయలక్ష్మి, ఆర్ఐ సంజీవ్ ఉన్నారు.

వర్గల్ మండలంలో..

వర్గల్(గజ్వేల్): అర్హులందరికీ ఓటుహక్కు కల్పించడమే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమ లక్ష్యమని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ అన్నారు. శనివారం ఆయన వర్గల్ మండలం చౌదరిపల్లి, వర్గల్, అంబర్‌పేట, శాకారం, వేలూరు, అనంతగిరిపల్లిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ హరికిరణ్‌కుమార్, ఆర్ఐ నాగరాజు ఉన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, పాలిటెక్నిక్ కళాశాలలో ఓటు నమోదు కోసం దరఖాస్తులను స్వీకరించారు. నియోజకవర్గంలోని 304 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీఓ బెన్‌షాలెం తెలిపారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా



జిల్లా కేంద్రంలోని పలు సినిమా థియేటర్లలో దేశభక్తి, ఆదర్శ చి న్నారుల చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని సినిమా థియేటర్లలో విద్యార్థులు సినిమా చూసి సందడి చేశారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

'నో బ్యాగ్స్ డే'



విద్యాశాఖ ఆదేశాల మేరకు మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం 'నో బ్యాగ్స్ డే' కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం, డంప్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల సందర్శనకు తీసుకెళ్లారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)

సన్మానం



ఫొటో జర్నలిస్టులను సన్మానిస్తున్న ట్రస్మా సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఫొటోగ్రఫీలో రాణించడం గొప్ప విషయమని ట్రస్మా స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గు మల్లారెడ్డి అన్నారు. ఉత్తమ ఫొటోగ్రాఫర్లుగా మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా అవార్డులు తీసుకున్న సతీష్, బాబురావు, భాస్కర్‌రెడ్డిని శనివారం సిద్దిపేటలో ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఫొటో జర్నలిస్టుల కృషిని ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, కోశాధికారి భగవాన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌గౌడ్, ట్రస్మా జిల్లా చీఫ్ అడ్వైజర్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వర్గల్(గజ్వేల్): కొత్తలైన్ నిర్మాణం సందర్భంగా ఆదివారం వర్గల్ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. చౌదరిపల్లి, శేరిపల్లి, గుంటిపల్లి, వర్గల్ టౌన్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ చేపట్టండి'

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్. విజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని ధర్మారం, మిరుదొడ్డి, అందె, అల్వాల, చెప్యాల, మల్లుపల్లి, కొండాపూర్, ఆరెపల్లి, కాసులాబాద్, లక్ష్మీనగర్, తదితర ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కుర్ర యాదగిరి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా నాయకులు విశ్వరూపం, అమరేందర్, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

వర్గల్(గజ్వేల్): సమస్యల ప్రస్తావన మినహా పెద్దగా చర్చలేకుండానే వర్గల్ మండల సర్వసభ్య సమావేశం జరిగింది. శనివారం ఎంపీపీ జాలిగామ లతా రమేష్‌గౌడ్ అధ్యక్షతన ఎంపీడీఓ మేరీస్వర్ణకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన సమావేశంలో జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ హరికిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఇదే చివరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కావొచ్చని పేర్కొన్నారు. మండల ప్రగతికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని నాచారం, వర్గల్, చౌదరిపల్లి, మజీద్‌పల్లి తదితర రోడ్లపై గుంతలు పట్టించుకోవడంలేదని సభ్యులు సభలో ప్రస్తావించారు. నిధులు లేకపోవడంతో మరమ్మతులు చేపట్టలేదని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాస్ సమాధానమిచ్చారు. విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం, పెరిగిన తర్వాత నరికేయడం సరికాదని సభ్యులు అధికారులకు సూచించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో చదువులు కుంటుపడే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఉపాధ్యాయుల కొరత తీర్చాలని నాచారం ఎంపీటీసీ వెంకటేశ్ కోరారు. క్షేత్రస్థాయిలో పంటల నమోదు ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని వ్యవసాయాధికారిని సభ్యులు కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి శివరంజని

అక్కన్నపేట(హుస్నాబాద్): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. మండలంలోని జనగామ గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతీ ఒక్కరికి న్యాయ విజ్ఞానం అందజేయడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణ చట్టం, ప్రాథమిక హక్కులు, విధుల గురించి వివరించారు. యువత గంజాయి సేవించకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల మానస, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. శనివారం బెజ్జంకిలో గ్రామ పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. కొందరు నాయకులు, విపక్ష పార్టీలు చెప్పే మాయ మాటలకు ఆగం కావొద్దన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో మొక్కలు నాటి మిని స్టేడియం నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, మండల పార్టీ అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ గుబిరె శారద, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీసీలు ఏకం కావాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాజ్యాధికారం దిశగా బీసీలందురూ ఏకం కావాలని బీసీ చైతన్య యాత్ర నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం బస్వాపూర్, సముద్రాల, నాగసముద్రాల గ్రామాల్లో పల్లె పల్లెకు బీసీ చైతన్య యాత్ర అనే కార్యక్రమం నిర్వహించారు.

◆ వరి సాగులో మెలకువలు పాటించాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): వరి సాగులో రైతులు మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని ఏఈఓ శివకుమార్ అన్నారు. మండలంలోని వరికోలులో వరి పంటలను పరిశీలించారు. రైతులు సలహాలు, సూచనల కోసం వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

◆ సీపీఎస్‌ను రద్దు చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి అన్నారు. మండలకేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత నమోదులో పాల్గొన్నారు.

◆ గౌరవెల్లిలో గ్రామసభ

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లిలో సర్పంచ్ పుష్పలీల అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. జీపీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షల నిధులు మంజూరు కాగా ఎక్కడ పంచాయతీ భవనం నిర్మించాలన్న దానిపై నిర్ణయం తీసుకున్నారు.

◆ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జగదేవ్‌పూర్(గజ్వేల్): దళితుల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎల్లాయిగూడ సర్పంచ్ రాములు అన్నారు. శనివారం గ్రామంలో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. దళితబంధు మంజూరు చేసిన సీఎం, మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ తిగుల్‌లో కొనసాగుతున్న దీక్షలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌ను నూతన మండలముగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 390 రోజులకు చేరుకున్నాయి. తిగుల్‌ను మండలం చేయాలని, లేకపోతే రానున్న ఎన్నికలను బహిష్కరిస్తామని సాధన సమితి సభ్యులు హెచ్చరించారు.

◆ మహిళా చట్టాలపై అవగాహన

దుబ్బాకరూరల్: మండలంలోని రామక్కపేట బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా సీఐ మున్నూరు కృష్ణ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషాకిరణ్, ప్రొబేషనరీ ఎస్ఐ దామోదర్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చంద్రయాన్-3 విజయవంతమైన సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్త్ ఫౌండేషన్ సభ్యుడు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీస్ కార్యాలయంలోని 23వ మహిళ మహాసభ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, కో ఆర్డినేటర్ అరుణ, ఎంపీటీసీ కవిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): దుద్దెడలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీలో ఖాళీగా ఉన్న సీట్లకు ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శశిధర్ తెలిపారు.

◆ పోలింగ్ కేంద్రాల సందర్శన

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంతో పాటు రేబర్తి, వంగపల్లి, పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ అనంతరెడ్డితో పాటు రెవెన్యూ అధికారులు సందర్శించారు.

◆ ఉపాధ్యాయుడి చేయూత

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు శంకర్ శనివారం రూ. 6 వేల విరాళం ఇచ్చి టై, బెల్టులను అందించారు.

◆ మదర్ థెరిస్సాకు నివాళి

కొమురవెల్లి(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంలో శనివారం మదర్ థెరిస్సా జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బెజ్జంకి ప్రభుత్వ ఆస్పత్రిలో మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని ఆశవర్కర్లను సన్మానించారు.

